




### దరఖాస్తు కన్నా ముందే.. తెలంగాణ దస్కత్

టీఆర్‌ఎస్ (నేటి బీఆర్‌ఎస్) పురుడు పోసుకున్న కొద్ది రోజులకే స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చాయి. ఉద్యమమే ధ్యేయంగా వ్యూహాలు రచించి తెలంగాణ వాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కేసీఆర్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. నిజానికి ఒక రాజకీయ పార్టీగా బీఆర్‌ఎస్ ఎన్నికల సంఘం వద్ద రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు (జూలై 11, 2001) చేసుకున్న తెల్లారినుంచే స్థానిక సంస్థల ఎన్నికలు.. ఫలితాలు రావడం మొదలైంది. గులాబీ జెండాను, బీఆర్‌ఎస్ పార్టీని 'రాజకీయ పార్టీ'గా ఎన్నికల సంఘం గుర్తించే (ఆగస్టు 18,2001) నాటికే తెలంగాణ వ్యాప్తంగా గులాబీ జెండా ఎగిరింది. తెలంగాణ భావజాలం వ్యాప్తి, రాష్ట్ర సాధన ఆకాంక్ష తీవ్రతను పల్లెపల్లెకు చేర్చాలన్న బలమైన వ్యూహంతో కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. గులాబీ జెండా.. రైతునాగలి గుర్తుతో పోటీచేసిన బీఆర్‌ఎస్ తెలంగాణ వ్యాప్తంగా వందలాది ఎంపీటీసీలు, 87 జడ్పీటీసీలను కైవసం చేసుకొంది. కరీంనగర్, నిజామాబాద్ రెండు జిల్లా పరిషత్‌లపై గులాబీ జెండా సగర్వంగా ఎగురవేసింది. ఒంటరిగా పోటీచేసిన ఆ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ 25 శాతం ఓట్లను సాధించి ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో తెలంగాణ సంచలన సంతకం చేసింది. అలాగే, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 12వేల వార్డులను గెలుచుకోవటం, 3వేల గ్రామాల్లో సర్పంచ్‌లను సొంతం చేసుకున్న బీఆర్‌ఎస్ గులాబీ జెండాను ఎగురవేసి తొలి చారిత్రక సంతకం చేసింది.

### సాగరహారం.. తెలంగాణ ఉద్యమ మణిహారం

తెలంగాణ మార్చ్ పేరుతో కార్యక్రమాన్ని 2012 సెప్టెంబర్ 30న నిర్వహించాలని మొదట భావించారు. తర్వాత తెలంగాణ వాదులు దాన్ని సాగరహారంగా మార్చారు. హుస్సేన్‌సాగర్ చుట్టూ పోలీసు వలయం. అక్కడినుంచి కిలోమీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు. హైదరాబాద్ నగరాన్ని బారికేడ్ల మయం చేశారు. అయితే, ఉద్యమ పిడికిళ్ల ముందు సర్కార్ ఏర్పాటుచేసిన బారికేడ్లు బద్దలయ్యాయి. ఇనుప కంచెలు చెల్లాచెదురయ్యాయి. వేలాదిగా తెలంగాణ వాదులు చీమల దండులా సాగరహారానికి తరలి వచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### తనను తాను పణంగా..

తెలంగాణ పట్ల బలమైన విశ్వాసాన్ని కల్పించాలంటే 'కేసీఆర్ పదవుల కోసం రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడు కాదు' అని నిరూపించాలి? అందుకు తన డిప్యూటీ స్పీకర్ (మంత్రి హోదా), ఎమ్మెల్యే, టీడీపీ ప్రాథమిక సభ్యత్వం అనే మూడు పదవులను కేసీఆర్ గడ్డిపోచలా విసిరికొట్టారు. తెలంగాణ చర్చకు తిరిగి ప్రాణప్రతిష్ఠ చేశారు. అధికార, రాజకీయ పదవులకు రాజీనామా చేయటమే కాకుండా ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు మరో ప్రతినబూనారు. తాను ఎత్తుకున్న 'జై తెలంగాణ' నినాదం పదవుల కోసమో, మరో ప్రయోజనం కోసమో కాదని నిరూపించారు. స్వతంత్ర భారత రాజకీయ, ప్రజా ఉద్యమాల చరిత్రలో ఎవరూ చేయని సాహసాన్ని కేసీఆర్ చేశారు. 'తెలంగాణ సాధన లక్ష్యం నుంచి నేను పక్కకు తప్పుకొంటే నన్ను రాళ్లతో కొట్టిచంపండి' అని పిలుపునిచ్చారు. తన రాజీనామాతో వచ్చిన సిద్దిపేట ఉప ఎన్నికల్లో (2001, సెప్టెంబర్) కేసీఆర్ 58,712 ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. తొలి ఉప ఎన్నికలో తెలంగాణ ఆత్మను ఆవిష్కరించారు. తెలంగాణ కోసం కేసీఆర్ తన రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టుకున్నారే తప్ప, ఏనాడూ తెలంగాణకు కించిత్ హాని తలపెట్టలేదని గడచిన 25 ఏండ్ల చరిత్ర చెప్తున్న సత్యం. తెలంగాణ ఆత్మగౌరవమే తన ఆత్మగౌరవంగా కేసీఆర్ భావించారు. కేసీఆర్ 2006లో కూడా తెలంగాణ కోసం కేంద్ర మంత్రి పదవి, ఎంపీ పదవులకు రాజీనామా చేసి ఆ ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తున నిలిపారు. 2006లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ వాదం లేదని విర్రవీగిన నాటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విరచిత కుట్రలను కరీంనగర్ పార్లమెంట్ ఉపఎన్నికల్లో రెండు లక్షల పైచిలుకు భారీ మెజారిటీతో గెలిచి తెగ్గోశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఢిల్లీకి బిగ్గరగా వినిపించారు.





### ఉప ఎన్నికలు... ఉద్యమ వ్యాప్తి సోపానాలు

రెండున్నర దశాబ్దాల ప్రయాణంలో ఉమ్మడి రాష్ట్రంలోనేకాదు భారతదేశ రాజకీయ పార్టీల చరిత్రలో ఏ రాజకీయ పార్టీ ఎదుర్కోనన్ని ఉప ఎన్నికలను బీఆర్‌ఎస్ పార్టీ ఎదుర్కొన్నదనటంలో అతిశయోక్తి లేదు. 2001లో తెలంగాణ కోసం తన నుంచి మొదలైన రాజీనామాల పరంపరను 2014లో రాష్ట్రం సాధించే దాక కేసీఆర్ వ్యూహాత్మకంగా కొనసాగించారు. పదవుల కోసమే తెలంగాణ వాదం ఎత్తుకున్నారని, తెలంగాణ వాదం లేదని, తెలంగాణ ప్రజల్లో అసలు రాష్ట్ర ఆకాంక్ష లేదని, ఒకవేళ ఉన్నా ఒకట్రెండు జిల్లాలకే పరిమితమని... ఇలా అనేకానేక అనుమానాలను ప్రజల్లో చొప్పించడానికి ప్రయత్నించిన ప్రతీసారి ఇక్కడి ప్రజలు తమ గుండె చీల్చి తెలంగాణ పటాన్ని ఆవిష్కరించిన సందర్భాలు అనేకం. కేసీఆర్ ఒక్కరే కాదు ఆయన తయారుచేసిన ప్రతి బీఆర్‌ఎస్ నాయకుడు తెలంగాణ కోసం తమ పదవులకు ఎప్పుడంటే అప్పుడు రాజీనామా చేశారు. తెలంగాణ

### చరిత్ర సృష్టించిన రహదారుల దిగ్బంధం రైల్‌రోకోలు

జాతీయ రహదారుల దిగ్బంధం, రైల్‌రోకో కార్యక్రమాలతో తెలంగాణ జాక్‌తో కలిసి బీఆర్‌ఎస్ మెరుపు ఉద్యమానికి నాయకత్వం వహించింది. 2010 ఫిబ్రవరి 3న ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు జాతీయ రహదారి అంతా మానవహారమై పిడికిలెత్తింది. 4వ తేదీన అదే జాతీయ రహదారులపై వంటావార్పు చేసింది. ఆ తెల్లారే కోదాడ నుంచి హైదరాబాద్ వరకు మరోసారి మానవహారం నిర్వహించారు. 2011 మార్చి నుంచి అక్టోబర్ దాక పలు సందర్భాల్లో రైల్‌రోకోలు నిర్వహించి ఉత్తర, దక్షిణ భారత రైల్ నెట్‌వర్క్‌ను స్తంభింపజేశారు. అసెంబ్లీ ముట్టడి, తెలంగాణ బంద్, విద్యాసంస్థల బంద్ ఆఖరికి తెలంగాణ వ్యాప్తంగా ఆటోలను సైతం నిరవధికంగా నడవనీయని పరిస్థితిని బీఆర్‌ఎస్ సృష్టించింది.